క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



గీసుకొండ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. బొడ్డు చింతలపల్లి గ్రామానికి చెందిన కె.వీరస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2లక్షలు చెక్కును గురువారం హనుకొండలోని ఎమ్మెల్యే నివాసంలో అందించినట్లు పేర్కొన్నారు.

ఖాతాల కంప్యూటరీకరణ

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కార్యాలయంలో పోస్టాఫీసు ఖాతాలు కంప్యూటరీకరణ చేస్తున్నట్లు నర్సంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆన్‌లైన్ ఖాతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాలు కంప్యూటరీకరణ చేసి బ్యాలెన్స్ ఆన్‌లైన్‌లో అప్డేట్ చేస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులు తమ వద్ద ఉన్న అన్ని రకాల పోస్టాఫీసు పుస్తకాలను పోస్టాఫీసుకు తీసుకోని రావాలన్నారు. కార్యక్రమంలో వడ్ల కొండ రాజుకుమార్, సదానందం , సునీల్, నిఖిల్, పాల్గొన్నారు.

నాయకులు తరలిరావాలి

గీసుకొండ : వరంగల్ నగరంలోని నాయుడు పంప్ జంక్షన్ సమీపంలో నిర్మించనున్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేయడానికి మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా శుక్రవారం మండలంలోని గ్రామపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరాలని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాభివృద్ధి సమష్టి బాధ్యత

దామెర : గ్రామాభివృద్ధిని సమష్టి బాధ్యతగా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి అభివర్ణించారు. మండలంలోని కోగిల్వాయి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి, నీటి, ఇతర పన్నులు నూరు శాతం వసూలయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు కలిగిన కూలీలందరూ వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎంపీటీసీ సంగరబోయిన మౌనిక కిరణ్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి సరళ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ : సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై మడికొండ ఎస్సై దివ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితుల కాల్స్, మెసేజీలు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. బ్యాంక్ ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జయ్‌రాజ్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల చేయూత

హసన్‌పర్తి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై వీధిన పడిన మల్లారెడ్డిపల్లికి చెందిన బయ్య కుమారస్వామి కుటుంబానికి పోలీసులు చేయూతనందించారు. బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను గురువారం అందించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, నాయకుడు కేతపాక భగత్, తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో గొర్రెల పంపిణీకి గ్రీన్ సిగ్నల్

హసన్‌పర్తి: విలీన గ్రామాల్లో గొర్రెల పంపిణీకి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్ వెల్లడించారు. హసన్‌పర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖపై జరిగిన చర్చ సందర్భంగా డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడారు. జూన్ నెల నుంచి విలీన గ్రామాల్లో కూడా గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. పది గ్రామాల్లో 701యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా గ్రామాల్లో పంట నష్టం జరిగిందని, ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో అసలు సర్వే నిర్వహించలేదని సూదన్‌పల్లి సర్పంచ్ ప్రశ్నలేవనెత్తారు. ఎప్పుడు సర్వే చేస్తారని ప్రశ్నించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హసన్‌పర్తి మండలంలో ఎనిమిది మంది ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు ఉన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



నర్సంపేట: ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు



సంగెం: జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

- నర్సంపేటలో ఐక్యత ర్యాలీ
- సంగెంలో ముగ్గు వేసి నిరసన

నర్సంపేట : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే క్రమబద్ధీకరించాలని జేపీఎస్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్‌లోని ఆరు మండలాల జేపీఎస్, ఓపీఎస్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మానవహారం నిర్వహించి అంబేడ్కర్ సెంటర్ నుంచి అమరవీరుల స్తూపం మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నెగిటివ్ మార్కింగ్ విధానంలో ఐదు లక్షల మంది పోటీ పడగా అందులో నుంచి ఎంపిక కావడం జరిగిందన్నారు. మూడు సంవత్సరాల ప్రొబేషనరీ కాలం ముగిసిన తర్వాత వారిని క్రమబద్ధీకరించి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులు నియమిస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించారని, ముఖ్యమంత్రి ఆదేశానుసారం మరో సంవత్సరం క్రమబద్ధీకరణ వాయిదా వేస్తూ జీఓ నంబర్ 26 తీసుకు వచ్చారని అన్నారు. అయినా నాలుగేళ్ల సర్వీసు ముగిసే వరకు ఎలాంటి ఆందోళనలు చేయకుండా విధులు నిర్వహించామన్నారు. తమను ఇప్పటి వరకు క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల సమ్మెకు వెళ్లామని తెలిపారు. వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులరైజ్ చేస్తూ విధులు నిర్వర్తించిన నాలుగు సంవత్సరాల కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు ఇనగాల సంఘీభావం

సంగెం : ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పరకాల ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో నడుపుతున్న జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, చింతలపల్లి సర్పంచ్ ఇండ్ల రవికుమార్, నాయకులు జనగాం రమేష్, పులి సాంబయ్య, మల్లారెడ్డి, భాస్కర్, సంపత్, భద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గు వేసి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

ముగ్గు వేసి జేపీఎస్‌ల నిరసన

సంగెం ఎంపీడీఓ ఆవరణలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు సమ్మెలో భాగంగా గురువారం ఇన్నాళ్లు తాము చేసిన పనులు తెలంగాణ రాష్ట్ర పటంలో ముగ్గు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు రమేష్, స్వప్న, కళ్యాణి, వాజీద్, అశోక్, సందీప్, సతీష్, నాగరాజు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ లభ్యం

నర్సంపేట రూరల్ : ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంటే కంగారు పడకుండా సీఈఐఆర్ యాప్ ద్వారా నమోదు చేస్తే ఫోన్‌ను వెతికి బాధితులకు అప్పగించనున్నట్లు నర్సంపేట టౌన్ సీఐ పులిరమేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏప్రిల్ 13వ తేదీన బీమగాని రాజశేఖర్ నర్సంపేటకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు రాజశేఖర్ వద్ద వివరాల సేకరించి సీఈఐఆర్ యాప్‌లో నమోదుచేశారు. ఆ యాప్ ద్వారా ఫోన్ వాడుతున్న వారి వివరాలు సేకరించి ఫోన్‌ను తీసుకొని గురువారం బాధితుడికి అప్పగించారు. అలాగే సీఈఐఆర్ యాప్ పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్, పోలీస్ సిబ్బంది సునీల్ పాల్గొన్నారు.



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ రమేష్, ఎస్సై

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

వరంగల్(పర్వతగిరి) : విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని డీఈ భిక్షపతి అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతనెక్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను గురువారం సర్పంచ్ గటిక సుష్మమహేష్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఇటీవల విద్యుత్ షాక్‌తో ఎర్రబెల్లి మాధవరావు అనే రైతు రెండు పశువులు మృతి చెందగా రూ.80వేల నష్టపరిహారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏడీ చంద్రమౌళి, ఏఈ రవి, ఉపసర్పంచ్ దేవేందర్‌చారి, వార్డు సభ్యులు జీడి గట్టయ్య, మదురి రాజు, రైతులు గటిక రామచంద్రు, మల్లేషం, ప్రభాకర్, అశోక్, సాంబయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న అధికారులు, సర్పంచ్

వాటర్ ప్లాంట్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో గల వాటర్ ప్లాంట్ మరమ్మతుల అనంతరం గురువారం ప్రారంభమైంది. నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్‌ను ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో మే 27న 'నిరుపయోగంగా వాటర్ ప్లాంట్' అనే వార్త కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ తూటి పావని రమేష్ వాటర్‌ప్లాంట్‌ను గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించి ప్రారంభించారు. ప్రజలు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది కరెడ్ల రాజు, నాయిని శేఖర్, బాను ప్రసాద్, రెడ్డి,బోనగిరి కొమ్మాలు, ఈర్ల వీరన్న, పెండ్యాల ఎల్లమ్మ, సమ్మక్కలు ఉన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ పావని

'తెలంగాణ భరోసా' పోస్టర్ల ఆవిష్కరణ



దుగ్గొండి: నాచినపల్లిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్

దుగ్గొండి : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నాచినపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో గురువారం ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగం రోజు రోజుకు పెరిగిపోతుందన్నారు. యువత ఆశలన్నీ ఆవిరయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జన్ను నితిన్, ఒంటేరు రాములు, తాళ్లపెల్లి రమేష్, మామునూరి ప్రవీణ్, జినుక భాస్కర్, సుధాకర్, మంద సుజాత, జన్ను రాధిక, తాళ్లపెల్లి సుమలత పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాయపర్తి : తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు చిలుముల కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి ప్రశాంత్‌గౌడ్, యాదగిరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు ఆహ్వానం



నర్సంపేట : పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయంలో నేడు(శుక్రవారం) నిర్వహించే హనుమాన్ నగర సంకీర్తన, శోభాయాత్రకు రావాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని గురువారం ఆలయ కమిటీ సభ్యులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. నగర సంకీర్తన, శోభాయాత్ర సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మండల శ్రీనివాస్, కానుగంటి రాజన్న, వెంకన్నగౌడ్, సత్తు అశోక్, తక్కళ్లపల్లి సంపత్‌రావు, ఒడపల్లి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వర్ధన్నపేట: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్



రాయపర్తి : పరామర్శిస్తున్న ఉషాదయాకర్‌రావు

వర్ధన్నపేట : పట్టణ కేంద్రానికి చెందిన కీర్తి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సొసైటీ చైర్మన్ కొడగాని రాజేశ్, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన తాటికాయల భాస్కర్ గుండెపోటుతో, అరూరి చంద్రశేఖర్ విద్యుదాఘాతంతో మృతిచెందారు.కాగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్, ఎంపీటీసీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష తగదు

చెన్నారావుపేట : అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికి వివక్ష చూపుతున్నారని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తోట చంద్రకళ అన్నారు. మహిళాల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని చంద్రకళ పిలుపునిచ్చారు. ఈ మేరకు అమీనాబాద్ శివారులోని పనికర గుట్టవద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెట్టుబడి వర్గాలతో మహిళలను మార్కెట్‌లో వస్తువులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, మద్యం మత్తులో పసిపిల్లలపై హింసలు, అత్యాచారాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, చట్టసభల్లో మహిళా బిల్లు కోసం సంవత్సరాల తరబడి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళా బిల్లును చట్టసభల్లో వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కసుకుల సరిత, వెంకటలక్ష్మి, నీరటి రజిత, రాధిక, లక్ష్మి, సావిత్రి, పద్మ, షాహీనా, రేణుక, రాజమ్మ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకళ

ఎలక్ట్రానిక్ గంట బహూకరణ



గీసుకొండ : మండల కేంద్రంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ–గీత దంపతులు రూ.8 వేల విలువైన ఎలక్ట్రానిక్ గంటను గురువారం బహుమతిగా అందించారు. కార్యక్రమంలో కర్ణకంటి రాంమూర్తి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

వర్ధన్నపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని బండౌతపురంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.కంటి సమస్యలతో బాధపడుతున్న వారు పరీక్ష చేయించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్‌ఖన్నా, మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్ మరుపట్ల అరుణ సాయికుమార్, ఎంపీటీసీ మరుపట్ల సురేష్, వైద్యబృందం గ్రామస్తులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అప్పారావు, భిక్షపతి

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలి

నర్సంపేట : కాకతీయ నగర్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలని ఏబీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, యూఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ ద్వారా గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని తొమ్మిదో వార్డు కాకతీయనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను గత 15సంవత్సరాల క్రితం విద్యార్థులు లేరన్న కారణంగా పాఠశాలను మూసివేశారు. పాఠశాల స్థలం, భవనాన్ని ఏ విధంగా ఉందోనని కనీసం అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని తెలిపారు. పాఠశాల స్థలం కబ్జాకు గురవుతుందని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్, విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వ పాఠశాల స్థలం కాపాడాలని కోరినప్పటికి అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. స్పందించి ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడి పాఠశాలను ప్రారంభించాలని కోరారు. వినయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

గీసుకొండ : గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బకాయిలు విడుదల చేయలని గీసుకొండ ఎంపీపీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగాని సౌజన్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి నెలకు రూ. వెయ్యి వేతనం పెంచామని సీఎం కేసీఆర్ గొప్పలు చెబుతున్నారని, అయితే గత ప్రభుత్వాల సిబ్బందికి ప్రమాద బీమా ఇచ్చేవారని, దహన సంస్కారాలకు రూ.5వేల సాయం అందించాలని జీఓ ఉన్నా అమలు చేయడం లేదన్నారు. నెలకు రూ.15వేల వేతనం ఇవ్వాలని, హెల్త్‌కార్డులు జారీ చేయాలని, రోజుకు 8 గంటలకు మించి పని చేయించ వద్దన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలో బైక్ చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు గద్దం ఉమేష్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇల్లందకు చెందిన రమేష్‌కు స్థానికంగా బేకరి గోదాం నిర్వహిస్తున్నాడు. బుధవారం తన ద్విచక్ర వాహనం టీఎస్ 24జీ 7185ను గోదాం రేకుల షెడ్‌లో పార్క్ చేశాడు. అనంతరం పనిముగించుకుని బైక్‌ను షెడ్‌లోనే పెట్టి ఇంటికి వెళ్లాడు. అయితే గురువారం ఉదయం షెడ్‌లో పార్క్ చేసిన బైక్ మాయమైనట్లు గుర్తించిన షెడ్ వర్కర్ వెంటనే యజమానికి సమాచారం అందించాడు. ఈమేరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టెండర్ పారదర్శకంగా నిర్వహించాలి

నర్సంపేట : అంగడిలో తైబజార్, గొర్రెల రహదారి టెండర్‌ను పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. 2021–22సంవత్సరానికి గాను అంగడిలో నిర్వహించిన తైబజార్ గొర్రెలు, మేకల రహదారి టెండర్ దక్కించుకున్న గుత్తేదారు నుంచి బకాయిని మొత్తం వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఖజానాను కాపాడి, రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయి వసూలు చేసి టెండర్‌దారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు గూడూరు సందీప్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్‌కుమార్, భవానిశంకర్, రాజేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తహసీల్దార్‌కు సన్మానం

గీసుకొండ : గీసుకొండ తహసీల్దార్ విశ్వనారాయణను సంస్కృతీ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం ఘనంగా సన్మానించారు. విశ్వనారాయణ ఉద్యోగంలో చేరి 36 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆయన సేవలను గుర్తించి ఫౌండేషన్ చైర్మన్ నన్నెం రాజ్యలక్ష్మి, మేనేజింగ్ డైరెక్టర్ కక్కెర్ల శ్రీనివాస్ శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాంబయ్య, సర్వేయర్ గోపీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లిపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన దుంపోజుల నరేష్(28) ఏప్రిల్ 30న తిమ్మంపేట నుంచి మల్లిపల్లికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ట్రాలీ వాహనం ఢీకొట్టింది. దీంతో నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంలో చేర్పించగా ఐదు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి మేనమామ కసివోజుల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మృతదేహాన్ని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కాట్ల భద్రయ్య, ఇట్టబోయిన స్వామి, అంబీరు రమేష్, నర్సింగరావు, వీరేందర్, కుమారస్వామి పాల్గొన్నారు.



నరేష్(ఫైల్)

7నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



దుగ్గొండి : మండలంలోని కేశవాపురం శ్రీవేంకటేశ్వరస్వామి 17వ బ్రహ్మోత్సవ వేడుకలు ఈనెల 7నుంచి 12వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 7న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, 8న శేషవాహనోత్సవం, 9న శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, 10న హనుమద్వాహన సేవ, 11న అలంకార సేవ, 12న మహా పూర్ణాహుతి, చక్రస్నానము, శ్రీ పుష్పయాగము నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వారి కుమారులు జితేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

రైతులను ఆదుకునేందుకు ప్రాధాన్యం

ఆత్మకూరు : రైతులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఆ నియోజకవర్గంలోని పరకాల, ఆత్మకూరు, నడికూడ, దామెర, గీసుగొండ, సంగెం, ఖిలా వరంగల్ మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై అధికారులతో హనుమకొండలోని తన నివాసంలో గురువారం ఆయన సమీక్షించారు. ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వర్షాల వల్ల నియోజకవర్గంలో వరి, ఇతర పంటలు వేసిన రైతులు భారీగా నష్టపోయారని ఆందోళన వెలిబుచ్చారు. పంటలు నష్టపోయిన రైతుల జాబితా, వివరాలు పూర్తిస్థాయిలో అంచనా వేసి సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అన్ని విధాలా న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు సర్వే చేయడంలో సమర్థవంతంగా పని చేయాలని. బాధితులెవరికీ అన్యాయం జరగకుండా పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేయాలన్నారు.